60 లక్షల ఇళ్ల సందర్శన
ఏళ్ల నమ్మకం
అభివృద్ధి, సంక్షేమం

RNI No: APTEL/2018/76747

# నవతరం

సామాజిక, రాజకీయ తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | సోమవారం | సంపుటి: 9 | సంచిక: 228 | పేజీలు: 04 | వెల: 5 /- | 17 ఆగస్టు 2026 |



హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



కామారెడ్డి జిల్లా బిచ్కుందలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

### చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

డా. నర్సింలు ఎల్లంపల్లి, బ్యూరో చీఫ్, తెలంగాణ రాష్ట్రం



**మేడారం, నవతరం:** వన దేవతలు సమ్మక్క - సారలమ్మ సన్నిధిలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి సమ్మక్క - సారలమ్మ గద్దెలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమం మొక్కులో భాగంగా సమ్మక్క సారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పించారు. ఆలయం ప్రాంగణంలో మొక్కను నాటారు.
ముఖ్యమంత్రి రాక సందర్భంగా గిరిజన పూజారులు డోలు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా అర్హులైన వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్లను పంపిణీ చేసి రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసేకార్యక్రమానికి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. మేడారానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. ఆలయ ప్రాంగణంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. మహిళా సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలు, వారి ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దనసరి అనసూయ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విప్ రామచంద్ర నాయక్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ రావు, నాయని రాజేందర్ రెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మురళి నాయక్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.







### చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు.. టైమింగ్స్ ఇవే!

## కొత్త రైలు




- చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్
- అక్టోబర్ 2న ప్రారంభం కానున్న సర్వీసులు
- పూర్తిగా నాన్-ఏసీ, స్లీపర్ కోచ్‌లతో ప్రయాణం
- తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, యూపీ మీదుగా రాకపోకలు
- హైదరాబాద్ నుంచి ఇది ఆరవ అమృత్ భారత్ సర్వీస్

డా. నర్సింలు ఎల్లంపల్లి, బ్యూరో చీఫ్, తెలంగాణ రాష్ట్రం

**హైదరాబాద్, నవతరం:** హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు ప్రయాణించే వారికి దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. చర్లపల్లి టెర్మినల్ నుంచి గోరఖ్‌పూర్ జంక్షన్ మధ్య కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (22075/22076) రైలును ప్రవేశపెట్టనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ నాన్-ఏసీ సూపర్ ఫాస్ట్ రైలు సర్వీసులు 2026 అక్టోబర్ నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.

ఈ రైలు (22075) చర్లపల్లి నుంచి గోరఖ్‌పూర్‌కు తన రెగ్యులర్ సర్వీసును అక్టోబర్ 2వ తేదీ (శుక్రవారం) నుంచి ప్రారంభించనుంది. ప్రయాణానికి సుమారు 32 గంటల 40 నిమిషాల సమయం పడుతుంది. తిరుగు ప్రయాణంలో గోరఖ్‌పూర్ నుంచి చర్లపల్లికి (22076) సర్వీసు అక్టోబర్ 4వ తేదీ (ఆదివారం) నుంచి మొదలవుతుంది. ఈ రైలు వారానికి ఒకసారి రెండు దిశల్లోనూ రాకపోకలు సాగిస్తుంది.

**ఆధునిక సదుపాయాలతో ప్రయాణం**

ఈ అమృత్ భారత్ రైలులో అత్యాధునిక సదుపాయాలు కల్పించారు. వేగవంతమైన ప్రయాణం కోసం పుష్-పుల్ టెక్నాలజీని ఉపయోగించారు. గంటకు 110 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు ప్రయాణిస్తుంది. ఇందులో కేవలం జనరల్ అన్ రిజర్వ్‌డ్, స్లీపర్ క్లాస్ కోచ్‌లు మాత్రమే ఉంటాయి. ఇవి ఆధునిక నాన్-ఏసీ బోగీలు కాగా, ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ పాయింట్లు, సీల్డ్ గ్యాంగ్‌వేలు వంటి సౌకర్యాలు ఉన్నాయి. హైదరాబాద్-సికింద్రాబాద్ ప్రాంతం నుంచి ప్రారంభమవుతున్న ఆరవ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, తెలంగాణకు సేవలందిస్తున్న ఏడవ సర్వీస్ ఇది కావడం విశేషం.

**మార్గం, సమయాలు**

ఈ రైలు తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తుంది. తెలంగాణలోని కాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల స్టేషన్లలో ఆగుతుంది. అక్కడి నుంచి బల్హర్షా, నాగ్‌పూర్, ఇటార్సి, భోపాల్, ఝాన్సీ, కాన్పూర్ సెంట్రల్, లక్నో మీదుగా గోరఖ్‌పూర్ చేరుకుంటుంది.

రైలు నెం. 22075 చర్లపల్లిలో ప్రతి శుక్రవారం రాత్రి 9:45 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 6:25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెం. 22076 ప్రతి ఆదివారం ఉదయం 8:30 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి, సోమవారం సాయంత్రం 5:00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ కొత్త సర్వీసుతో హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్ వెళ్లే వలస కార్మికులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

## తనకు స్ఫూర్తి కలిగించింది ఇదే



- షారుఖ్ 'స్వదేశ్' సినిమా చూసి భారత్‌కు తిరిగొచ్చిన దీప్కే
- వందకు పైగా సార్లు ఈ సినిమా చూశానని వెల్లడి
- మహారాష్ట్రలో 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారాన్ని ప్రారంభం
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై దృష్టి
- ఈయన నిరసనతోనే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**హైదరాబాద్, నవతరం:** సినిమాలు కేవలం వినోదాన్ని మాత్రమే కాదు, కొందరి జీవితాల్లో బలమైన స్ఫూర్తిని నింపి, వారి గమనాన్ని నిర్దేశిస్తాయి. సరిగ్గా ఇలాంటి ఓ సంఘటనే కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జీవితంలో చోటుచేసుకుంది. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ నటించిన 'స్వదేశ్' సినిమా తనను ఎంతగా ప్రభావితం చేసిందో, ప్రజాసేవ వైపు ఎలా నడిపించిందో ఆయన తాజాగా వెల్లడించారు. ఈ స్ఫూర్తితోనే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తన సొంతూరులో 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలలను బాగుచేయండి) అనే ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో ఉన్న తన స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా బెంచీలు, తాగునీటి సరఫరా, కిటికీలు, మరుగుదొడ్ల వంటి కనీస వసతుల కొరతను ఆయన ఎత్తిచూపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో తన అనుభవాలను పంచుకున్నారు. "చిన్నప్పటి నుంచి 'స్వదేశ్' సినిమా చూస్తూ పెరిగాను. ఆ సినిమాతో ఎంతగా ప్రేమలో పడ్డానంటే, ఇప్పటికి వందకు పైగా సార్లు చూసి ఉంటాను. అందులోని మోహన్ పాత్ర నన్ను

మిగతా 4లో..

## నేడు భోగాపురంలో దిగే తొలి విమానం ఇదే.. ప్రయాణికులకు గిఫ్టులు!



- భోగాపురం ఎయిర్‌పోర్టులో మొదలుకానున్న విమాన సర్వీసులు
- హైదరాబాద్ నుంచి తొలి విమానంగా ఇండిగో ఫ్లైట్
- తొలి ప్రయాణికులకు ఏటికొప్పాక బొమ్మలతో ప్రత్యేక స్వాగతం
- బెంగళూరు నుంచి రెండో విమానంగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

**భోగాపురం, నవతరం:** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరుతూ, భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన సర్వీసులు ఈ అర్ధరాత్రి తర్వాత ప్రారంభమవుతున్నాయి. ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలుకుతూ హైదరాబాద్ నుంచి ఇండిగో విమానం తొలిసారిగా ఇక్కడి రన్‌వేపై అడుగుపెట్టనుంది. ఈ అపురూప క్షణంతో ఈ ప్రాంత విమానయాన చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలు కానుంది.

విమానాశ్రయ ప్రారంభోత్సవంలో భాగంగా తొలి విమానంగా ఇండిగోకు చెందిన 6E6408 ఫ్లైట్ హైదరాబాద్ నుంచి ఉదయం 6:45 గంటలకు భోగాపురంలో ల్యాండ్ అవుతుంది. ఆ తర్వాత కొద్దిసేపటికే, ఉదయం 7:30 గంటలకు బెంగళూరు నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన IX2064 విమానం కూడా ఇక్కడికి చేరుకుంటుంది. ఈ రెండు విమానాల రాకతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభమవుతాయి.

ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలకు చెక్-ఇన్ హాల్‌లో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అనంతరం, తొలి ప్రయాణికులకు బోర్డింగ్ పాసులు అందజేసి, ఎయిర్‌లైన్స్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోనున్నారు. తొలి విమానాల్లో వచ్చిన ప్రయాణికులకు అధికారులు ప్రత్యేక రీతిలో స్వాగతం పలకనున్నారు. వారికి స్థానిక సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఏటికొప్పాక బొమ్మలు, ఫస్ట్-ఫ్లైట్ సర్టిఫికెట్లతో కూడిన గూడీ బ్యాగ్‌లను కానుకలుగా అందజేయనున్నారు.

ఇదిలా ఉండగా, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 20 వరకు హై అలర్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో విమానాశ్రయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులు భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు.

### భోగాపురం నుంచి ఢిల్లీకి 14 విమానాలు

విశాఖపట్నం నుంచి కార్యకలాపాలు సాగించే ఎయిరిండియా విమాన సర్వీసులన్నీ ఇకపై భోగాపురంలోని నూతన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నడవనున్నాయి. ఆగస్టు 17 నుంచి ఈ మార్పు అమల్లోకి వస్తుందని ఎయిరిండియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు ఎలాంటి గందరగోళం లేకుండా, పాత విశాఖ ఎయిర్‌పోర్ట్ కోడ్ VTZనే కొత్త విమానాశ్రయానికి కూడా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది.

భోగాపురం నుంచి ఢిల్లీకి వారానికి 14 విమాన సర్వీసులను యథాతథంగా కొనసాగిస్తామని సంస్థ వెల్లడించింది. దీని ద్వారా తమ హబ్స్ మీదుగా కీలకమైన దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలకు ప్రయాణికులు సులభంగా చేరుకోవచ్చని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రాల మధ్య విమాన కనెక్టివిటీని మెరుగుపరిచేలా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ నగరాలకు పలు రోజువారీ సర్వీసులను నడపనున్నట్లు తెలిపింది.

కొత్త షెడ్యూల్ ప్రకారం, హైదరాబాద్ - భోగాపురం మధ్య రోజుకు రెండు విమాన సర్వీసులు నడుస్తాయి. బెంగళూరు - భోగాపురం మధ్య కూడా రోజుకు రెండు సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అదనంగా సోమ, మంగళ, బుధ, గురు, శనివారాల్లో మరో రిటర్న్ సర్వీసును కూడా నడపనున్నారు. ప్రస్తుత ఏవియేషన్ టైమ్‌టేబుల్ ప్రకారం, ఈ కొత్త విమాన షెడ్యూల్ అక్టోబర్ 24 వరకు అమల్లో ఉంటుంది.

విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన ఈ కొత్త విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. సుమారు 77,342 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ కొత్త టెర్మినల్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక వసతులు కల్పించారు. ఇందులో 22 సంప్రదాయ చెక్-ఇన్ కౌంటర్లు, 18 సెల్ఫ్-బ్యాగేజ్ డ్రాప్ యూనిట్లు, అధునాతన స్క్రీనింగ్ వ్యవస్థలు, అత్యాధునిక బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సౌకర్యాలతో పాటు ఏడు ఏరోబ్రిడ్జ్‌లు ఉన్నాయి.

ఇకపై ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌ను రక్షణ, పోలీసు అవసరాలు, వీవీఐపీల రాకపోకలు, షెడ్యూల్ లేని ప్రత్యేక విమానాల కోసం మాత్రమే వినియోగిస్తారని అధికారులు తెలిపారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్‌కు సేవలందించే ఈ విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో విమానయాన సేవలు మరింత విస్తృతం కానున్నాయి.

## 60 లక్షల ఇళ్ల సందర్శన..

- ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం కీలక మైలురాయి
- 21 రోజుల్లో 61.61 లక్షల ఇళ్లను సందర్శించిన శ్రేణులు
- కూటమి రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరిస్తున్న నేతలు
- స్థానిక సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి




తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం కీలక మైలురాయిని అధిగమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షలకు పైగా కుటుంబాలను సందర్శించాయి. కేవలం 21 రోజుల్లోనే మొత్తం 61.61 లక్షల ఇళ్లకు నేరుగా వెళ్లినట్లు టీడీపీ ఆదివారం ఓ పత్రికా ప్రకటనలో వెల్లడించింది.

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు వివరించడంతో పాటు, స్థానిక సమస్యలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 21వ రోజైన ఆదివారం ఒక్కరోజే పార్టీ నాయకులు, కార్యకర్తలు 2.60 లక్షల కుటుంబాలతో మమేకమయ్యారు. ప్రతి ఇంటి వద్ద ప్రభుత్వ పథకాల ద్వారా వివిధ వర్గాలకు అందుతున్న ప్రయోజనాలను వివరిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, పేదల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ప్రజలకు తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల నుంచి వచ్చిన వినతులు, స్థానిక సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పార్టీ తెలిపింది. 60 లక్షల ఇళ్ల సందర్శన మైలురాయిని అధిగమించిన స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని మరింత వేగంగా, విస్తృతంగా కొనసాగిస్తామని టీడీపీ నేతలు పేర్కొన్నారు.

## స్వయం సహాయక సంఘాల మహిళలు, భక్తులను పలకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**మేడారం, నవతరం:** మేడారంలో వన దేవతలు సమ్మక్క - సారలమ్మ గద్దెలను సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలు, భక్తులను వరుసగా కలుస్తూ వారితో మాట్లాడారు. వారు చెప్పిన విషయాలను శ్రద్ధగా విన్నారు. మహిళా సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలు, వారి ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.

మూడు జిల్లాల్లో తీరిక లేని కార్యక్రమాలతో పర్యటన కొనసాగినప్పటికీ మేడారం సమ్మక్క - సారలమ్మ దేవాలయం వద్ద ప్రజలతో మమేకమయ్యారు. వనదేవతలను సందర్శించుకున్న తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా అక్కడికి వచ్చిన భక్తుల వద్దకు వెళ్లి వరుసగా పలకరిస్తూ వారితో కరచాలనం చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు వెంట రాగా ముఖ్యమంత్రి సమ్మక్క సారలమ్మ దేవాలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తూనే భక్తులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు.

### రైల్వే స్టేషన్లలో కలుషిత నీరు..

## కాగ్ నివేదికతో రంగంలోకి దిగిన కేంద్రం

- రైల్వే స్టేషన్లలో కలుషిత తాగునీటిపై కాగ్ నివేదికతో కేంద్రం అప్రమత్తం
- మంత్రి అశ్విని వైష్ణవ్ ఉన్నతస్థాయి సమీక్ష.. తక్షణ చర్యలకు ఆదేశం
- హైదరాబాద్ సహా 8 స్టేషన్ల నీటిలో 'ఇ కోలి' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తింపు
- దేశవ్యాప్తంగా 20,000 చోట్ల కొత్త ఫిల్టర్ల ఏర్పాటుకు రైల్వే శాఖ నిర్ణయం
- 89 శాతం స్టేషన్లలో కనీస సౌకర్యాల కొరత ఉందని కూడా కాగ్ నివేదిక వెల్లడి



**హైదరాబాద్, నవతరం:** దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అందిస్తున్న తాగునీరు సురక్షితం కాదని, ప్రమాదకర బ్యాక్టీరియా ఆనవాళ్లు ఉన్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక హెచ్చరించడంతో రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నేతృత్వంలో సీనియర్ అధికారులతో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం, స్టేషన్లలో సురక్షితమైన తాగునీటిని అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రైల్వే బోర్డును ఆదేశించారు.

ఈ సమస్యను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, రైల్వే బోర్డు స్థాయిలో నేరుగా పర్యవేక్షించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్‌లోని 20,000 ప్రదేశాలలో వాటర్ కూలర్లతో పాటు సమగ్ర ఫిల్టరేషన్, పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్లలో "ట్యాంక్ టూ ట్యాప్" వాటర్ ఫిల్టరేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని, పాత నీటి ట్యాంకులను వెంటనే మార్చాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, దీనిపై జవాబుదారీతనాన్ని స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. నీటి నాణ్యతకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచి పారదర్శకత పాటించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు.

**కాగ్ నివేదికలో కీలక అంశాలు**

దేశంలోని అన్ని జోన్ల పరిధిలో 512 నాన్-సబర్బన్ గ్రేడ్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సేవలను కాగ్ అంచనా వేసింది. ఈ తనిఖీల్లో భాగంగా నాలుగు జోన్ల పరిధిలోని ఎనిమిది స్టేషన్లలోని వాటర్ కూలర్ల నుంచి సేకరించిన నీటి నమూనాలలో 'ఇ కోలి' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా వల్ల ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. 'ఇ కోలి' బ్యాక్టీరియాను గుర్తించిన స్టేషన్లలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్, దక్షిణ రైల్వేలోని కోయంబత్తూర్, పాలక్కాడ్ జంక్షన్లు, మధ్య రైల్వేలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, భివండి రోడ్, కళ్యాణ్, లోనావాలా, తూర్పు రైల్వేలోని మధుపూర్ ఉన్నాయి. మిగతా 4లో..

## ఆ పాప పెద్ద హీరోయిన్ అవుతుంది

### 'ఇరుముడి' ఈవెంట్‌లో రవితేజ



- చైల్డ్ ఆర్టిస్ట్ నక్షత్ర భవిష్యత్తులో పెద్ద హీరోయిన్ అవుతుందన్న మాస్ రాజా
- సినిమా సంగీతం, నటీనటుల పనితీరుపై ప్రశంసల జల్లు
- దర్శకుడు శివ నిర్వాణ గురించి సక్సెస్ మీట్‌లో మాట్లాడతానన్న రవితేజ
- ఆగస్టు 21న థియేటర్లలో సినిమా విడుదల

టాలీవుడ్, నవతరం: మాస్ మహారాజా రవితేజ తన తాజా చిత్రం 'ఇరుముడి' విజయంపై పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆగస్టు 21న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ వేడుకలో ఆయన పాల్గొని పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా, ఈ చిత్రంలో నటించిన చైల్డ్ ఆర్టిస్ట్ నక్షత్ర ప్రతిభను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించాడు.

"నక్షత్ర భవిష్యత్తులో కచ్చితంగా గొప్ప కథానాయిక అవుతుంది" అని రవితేజ జోస్యం చెప్పాడు. తమ ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ఎంతో హృద్యంగా ఉంటాయని, అవి ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తాయని తెలిపాడు. హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ అద్భుతమైన నటన కనబరిచిందని, మరో నటి తన నటనతో విస్మయానికి గురిచేసిందని కొనియాడాడు. అలాగే సాయి కుమార్, రమేశ్ ఇందిరల మిగతా 4లో..

## జాతీయ గీతాన్ని మార్చాలి

- 'జన గణ మన' స్థానంలో 'వందేమాతరం'ను జాతీయ గీతంగా ప్రకటించాలన్న నటుడు
- ఈ దిశగా మోదీ ప్రభుత్వం ఇప్పటికే పనిచేస్తోందని ముఖేష్ ఖన్నా వ్యాఖ్య
- 'జన గణ మన' బ్రిటీష్ రాణిని కీర్తిస్తూ రాసిన గీతమని ఆరోపణ
- గతంలోనూ పలు వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచిన నటుడు



90వ దశకంలో 'శక్తిమాన్' సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ నటుడు ముఖేష్ ఖన్నా మరోసారి సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. జాతీయ గీతం 'జన గణ మన'ను తొలగించి, దాని స్థానంలో 'వందేమాతరం'ను అధికారిక జాతీయ గీతంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. 'జన గణ మన' మన దేశ జాతీయ గీతం కాదని, అది బ్రిటీష్ రాణిని కీర్తిస్తూ రాసిన గీతమని ఆయన ఆరోపించారు. ఆదివారం ఒక వార్తా సంస్థతో ముఖేష్ ఖన్నా మాట్లాడుతూ, "వందేమాతరంను జాతీయ గీతంగా చేయాలని నేను మూడేళ్ల క్రితమే చెప్పాను. రవీంద్రనాథ్ ఠాగూర్ బ్రిటీష్ రాణి ఎలిజబెత్‌ను పొగుడుతూ మిగతా 4లో..

# ప్రజలకు అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్




- హైదరాబాద్ ఎర్రగడ్డలో అత్యాధునిక సౌకర్యాలతో 'టిమ్స్'
- రూ.1100 కోట్ల వ్యయంతో వెయ్యి పడకల సామర్థ్యంతో నిర్మాణం
- సోమవారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం
- హాజరుకానున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రారంభ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్, నవతరం:** నగర వైద్య మౌలిక సదుపాయాల్లో మరో కీలక అధ్యాయానికి సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఎర్రగడ్డలో అత్యాధునిక వసతులతో నిర్మించిన మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డా.ఎంసీఆర్ టిమ్స్) సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు (సోమవారం) సాయంత్రం 4.30 గంటలకు లాంఛనంగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

సుమారు 22.6 ఎకరాల సువిశాల ప్రాంగణంలో రూ.1,100 కోట్ల భారీ వ్యయంతో ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. వెయ్యి పడకల సామర్థ్యంతో, ఐదు బ్లాకులతో దీనిని అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే ఆసుపత్రిలో ట్రయల్ రన్ నిర్వహించి, డే కేర్ విభాగాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ క్రమంలో రోజుకు సుమారు 250 మంది రోగులకు వైద్య సేవలు అందిస్తూ వస్తున్నారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ప్రధాన ఆసుపత్రుల నుంచి బదిలీపై వచ్చిన వారితో పాటు కొత్తగా నియమితులైన దాదాపు 200 మంది వైద్య సిబ్బంది ఇక్కడ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. మాజీ డీఎంఈ డా.ఎ.నరేంద్రకుమార్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా, మాజీ ఏడీఎంఈ డా.మహబూబ్ ఖాన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరించనున్నారు.

ఆసుపత్రి ప్రారంభోత్సవం నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం ఏర్పాట్లను సమీక్షించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రతాపరమైన లోపాలు లేకుండా చూడాలని పోలీసు శాఖకు స్పష్టం చేశారు.

ప్రభుత్వాల సెన్సార్‌షిప్‌పై ఎలాన్ మస్క్ కీలక నిర్ణయం

# ఇక అన్నీ పబ్లిక్




- కంటెంట్ తొలగింపుపై ప్రభుత్వ ఆదేశాలను బహిర్గతం చేయనున్న ఎక్స్
- పారదర్శకత పెంచడంలో భాగంగానే ఈ నిర్ణయమన్న ఎలాన్ మస్క్
- ఏ ప్రభుత్వ ఏజెన్సీ అభ్యర్థించిందో యూజర్లు చూడగలరు
- మస్క్ యాజమాన్యంలో ప్రభుత్వ అభ్యర్థనల అమలు రేటు అధికమని నివేదిక
- రికమండేషన్ అల్గారిథమ్‌పైనా పారదర్శకతకు చర్యలు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కంటెంట్ తొలగింపు లేదా పరిమితులపై ప్రభుత్వాల నుంచి వచ్చే అభ్యర్థనలను యూజర్లకు మరింత స్పష్టంగా కనిపించేలా చేస్తామని ప్రకటించారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ జోక్యం, కంటెంట్ నియంత్రణ వంటి అంశాల్లో పారదర్శకతను పెంచే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. ఈ కొత్త మార్పుల గురించి ఎక్స్‌లో పోస్ట్ చేసిన మస్క్, "ప్రభుత్వాలు కోరిన ఏ సెన్సార్‌షిప్ అయినా ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది" అని తెలిపారు. దీని ప్రకారం, ఏ ప్రభుత్వ ఏజెన్సీ పోస్టులను తొలగించాలని కోరింది, ఏ ఖాతాలపై పరిమితులు విధించాలని అడిగింది వంటి వివరాలను యూజర్లు నేరుగా చూడగలుగుతారు. వీలైతే, ఆ అభ్యర్థనల వెనుక ఉన్న చట్టపరమైన కారణాలు లేదా సమర్థనలను కూడా వెల్లడించనున్నట్లు ఎక్స్ తెలిపింది. ఎక్స్‌ను కొనుగోలు చేసినప్పటి నుంచి ఆన్‌లైన్ కంటెంట్‌ను ఎలా నియంత్రిస్తున్నారు, ర్యాంక్ ఇస్తున్నారు అనే విషయాల్లో యూజర్లకు పూర్తి పారదర్శకత ఉండాలని మస్క్ బలంగా వాదిస్తున్నారు. ఈ తాజా నిర్ణయం కూడా ఆయన విస్తృత లక్ష్యాల్లో భాగమే.

ఇదిలా ఉండగా, క్రిప్టో బ్రీఫింగ్ నివేదిక ప్రకారం, మస్క్ యాజమాన్యంలో ఎక్స్.. ప్రభుత్వాల నుంచి వచ్చిన టేక్‌డౌన్ అభ్యర్థనలను 83 శాతం నుంచి 98.8 శాతం వరకు అమలు చేసింది. ఇది పాత యాజమాన్యం కంటే అధికం కావడం గమనార్హం. కేవలం ప్రభుత్వ అభ్యర్థనలకే పరిమితం కాకుండా, తమ రికమండేషన్ అల్గారిథమ్‌లను కూడా ఎక్స్ పారదర్శకంగా ఉంచుతోంది. టెక్నాలజీలోని కొన్ని భాగాలను ఓపెన్-సోర్స్ చేయడం ద్వారా, ఏ పోస్టులను ప్రమోట్ చేస్తున్నారు, వేటిని తగ్గించి చూపుతున్నారు అనే అంశాలపై పరిశోధకులకు, యూజర్లకు స్పష్టత ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. మొత్తం మీద, కంటెంట్ నియంత్రణలో యూజర్లకు మరింత స్పష్టమైన సమాచారం అందించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.

# 'చుడైల్'గా భయపెట్టేందుకు సన్నీ రెడీ..!

## కొత్త సినిమా కోసం ఇస్కాన్ ఆలయంలో సన్నీ లియోన్ పూజలు

- భర్త డేనియల్ వెబర్‌తో కలిసి ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించిన సన్నీ లియోన్
- తన తదుపరి సినిమా షూటింగ్ ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు
- ప్రస్తుతం 'డీజే వరల్డ్ టూర్'తో ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తున్న నటి
- 'చుడైల్' అనే హారర్ కామెడీ చిత్రంలో దెయ్యం పాత్రలో కనిపించనున్న సన్నీ
- సెప్టెంబర్‌లో తెలుగుతో సహా పలు భాషల్లో విడుదల కానున్న 'చుడైల్'



బాలీవుడ్ నటి సన్నీ లియోన్ తన తదుపరి ప్రాజెక్టుల విజయం కోసం దైవ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తన భర్త డేనియల్ వెబర్‌తో కలిసి ముంబైలోని ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించారు. త్వరలో ప్రారంభం కానున్న తన కొత్త సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తూ ఆమె ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తుల్లో సన్నీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పింక్ కలర్ ఎంబ్రాయిడరీ సల్వార్ సూట్‌లో ఆమె ఎంతో హుందాగా కనిపించారు. ఆమె భర్త డేనియల్ గ్రీన్ షర్ట్, క్రీమ్ ప్యాంట్‌తో కనిపించారు. ప్రస్తుతం సన్నీ లియోన్ ఒకవైపు సినిమాలు, మరోవైపు అంతర్జాతీయ ప్రదర్శనలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఇటీవల ఆమె 'డీజే వరల్డ్ టూర్' పేరుతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు.

ఈ టూర్‌లో భాగంగా భారత్‌లోని ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, కొచ్చి నగరాలతో పాటు థాయిలాండ్, కెనడా, గ్లాస్గో, డబ్లిన్ వంటి అంతర్జాతీయ నగరాల్లోనూ తన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. త్వరలోనే ఆస్ట్రేలియాలో కూడా ఈ టూర్ జరగనుంది. ఇక సినిమాల విషయానికొస్తే, 'కెన్నడీ' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న సన్నీ, ప్రస్తుతం 'చుడైల్' అనే హారర్ కామెడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. టీఎల్‌వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాహుల్ దేవ్, మందన కరిమి ప్రధాన పాత్రలు పోషించారు. ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్ వీధుల్లో తిరిగే ఒక దెయ్యం పాత్రలో సన్నీ కనిపించనుండగా, ఆమెకు పోటీగా మరో అతీతశక్తిగా మందనా కరీమి నటించారు. నిర్మాత మహీంద్రా ధరివాల్‌కు ఇది 50వ చిత్రం కావడం విశేషం. పాన్-ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రాన్ని 2026 సెప్టెంబర్ చివరి నాటికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హిందీతో పాటు తెలుగు, తమిళం, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేయనున్నారు.





# ఉత్తరాంధ్రకు అలర్ట్

- **బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. వాయవ్య బంగాళాఖాతంలో, ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు దగ్గరలో కేంద్రీకృతమైన ఈ వ్యవస్థ సోమవారం నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో రానున్న నాలుగైదు రోజులు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఉత్తరాంధ్ర తీర ప్రాంతానికి హెచ్చరికలు జారీ చేసింది. తీవ్ర అల్పపీడనం కారణంగా ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. అందువల్ల మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని అధికారులు సూచించారు.

ఈ అల్పపీడన ప్రభావంతో సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పోలవరం, ఏలూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



అదేవిధంగా మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లలో అతిభారీ వర్షాలు, మధ్య భారతం మీదుగా పయనించి జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఆగస్టు 18 వరకు భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది. అయితే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండటం గమనార్హం.

# హోమ్‌స్టేలుగా మారిన స్టార్ల గృహాలు

- ఆదాయం కోసం విల్లాలను అద్దెకు ఇస్తున్న సినీ, క్రీడా ప్రముఖులు

అభిమాన తారల ఇళ్లను చూడటమే గొప్ప అనుభూతి. అలాంటిది వారి ఇంట్లోనే బస చేసే అవకాశం వస్తే ఎలా ఉంటుంది? ఈ ఊహే అద్భుతంగా ఉంది కదూ! ఒకప్పుడు అసాధ్యంగా అనిపించిన ఈ కలను ఇప్పుడు కొందరు సెలబ్రిటీలు నిజం చేస్తున్నారు. షారుక్ ఖాన్,



శ్రీదేవి, అలియా భట్ వంటి సినీ తారలతో పాటు యువరాజ్ సింగ్ వంటి క్రీడా దిగ్గజాలు తమ విలాసవంతమైన గృహాలను 'లగ్జరీ హోమ్‌స్టే'లుగా మార్చి, అభిమానులకు సరికొత్త అనుభూతిని పంచుతున్నారు.

మిగతా 4లో..

# ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన ఫొటోకు అవార్డు



కూకట్‌పల్లి, నవతరం: తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూస్ ఫొటో కాంపిటీషన్-2026లో కూకట్‌పల్లి నమస్తే తెలంగాణ ఫొటోజర్నలిస్ట్ గడ్డం శ్రవణ్ కుమార్ అవార్డు అందుకున్నారు. ప్రజా సమస్యలను ప్రతిబింబించేలా తీసిన ఫొటోకు ఈ అవార్డు దక్కింది.ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఫొటోల రూపంలో వెలుగులోకి తీసుకురావడం, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేయడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమన్నారు. జర్నలిజం ద్వారా ప్రజాసేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తన కృషిని గుర్తించి అవార్డుతో సత్కరించిన తెలంగాణ స్టేట్ ఫొటోజర్నలిస్ట్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యలను కెమెరా కంటితో చూపిస్తూ, సమాజానికి ఉపయోగపడే కథనాలకు మరింత ప్రాధాన్యం ఇస్తానని శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు.

## గాజులరామారంలో..

# అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

- కుత్బుల్లాపూర్ జోన్, గాజులరామారం సర్కిల్ – 57 లో అక్రమ షెడ్ల హవా
- అనుమతులతో పని లేకుండాణె నిర్మాణాలు
- చూట్టాపుచూపుగా నామమాత్రపు నోటీసులు జారీ చేస్తున్న టౌన్ ప్లానింగ్ యంత్రాంగం
- నిద్రమత్తులో జోనల్ కమిషనర్.. అందినకాడికి దండుకుంటున్న కింది స్థాయి సిబ్బంది
- అప్పటి డీసీ మల్లారెడ్డి తోవలోనే ప్రస్తుత అధికారులు
- బై నంబర్లలో అనుమతులిచ్చి భారీ గా దండుకున్న మల్లారెడ్డి..?
- అధికారులు మారినా.. అవినీతి మాత్రం మారడం లేదు
- ముడుపులు చెల్లించుకున్నాం.. మాకేం భయం లేదంటున్న నిర్మాణదారులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోరా.. ప్రక్షాళన జరగాల్సిందేనా..?
- సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జర దేఖో..







ID 307265967833
Type Unauthorized Construction
Landmark 277-Mahadevpuram, Gajularamaram, Qutbullapur
Mobile No 9618907705

**గాజులరామారం, నవతరం:** సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని గాజులరామారం సర్కిల్ - 57 అవినీతి అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. ఎన్నడూ లేని విధంగా బహుళ అంతస్తుల భావన నిర్మాణాలు, కమర్షియల్ షెడ్ల నిర్మాణాలు జోరుగా వెలుస్తున్నాయి. ఎక్కడ చూసినా ఒకే మాట.. మున్సిపల్ అధికారులను చూసుకున్నాం.. మాకు అనుమతులతో పనేంటి? అంటూ స్థానిక టౌన్ ప్లానింగ్ అవినీతి భాగోతం బట్టబయలు చేస్తున్నారు నిర్మాణదారులు. నివాసాల మధ్య కమర్షియల్ షెడ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం కుదరదు కాబట్టి అవినీతి కంపులో కూరుకుపోయిన కొందరు లంచగొండి అధికారులు ఆమ్యామ్యాలకు అలవాడుపడి.. అలవాటులో పొరపాటుగా అటువైపు వెళ్లాడమే మర్చిపోతున్నారు సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు. గాజులరామారం, మహదేవపురం, కైలాష్ హిల్స్, ద్వారకా నగర్, మల్లారెడ్డి నగర్, ఉషోదయ కాలనీ, దేవేందర్ నగర్, కైసర్ నగర్.. ఇలా చెప్పుకుంటూ పోతే అవినీతి అక్రమ నిర్మాణాల లిస్ట్ చాంతాడంత అవుతుంది. ప్రధానంగా గాజులరామారం నవీన్ వైన్స్ వెనకాల షెడ్డు నిర్మాణం చేపట్టిన నిర్మాణదారుడు నివాసాల మధ్య ఎలాంటి అధికారుల భయం లేకుండా కమర్షియల్ షెడ్డు నిర్మాణం చేపడుతున్నాడు.




గాజులరామారం నవీన్ వైన్స్ వెనకాల నిర్మిస్తున్న 'జీరో పర్మిషన్' కమర్షియల్ షెడ్డు

ఇదే విషయమై స్థానికులు ఇండ్ల మధ్యలో ఎలా షెడ్డు నిర్మిస్తారు, అనుమతులు ఎవరిచ్చారు అని ప్రశ్నించగా.. మాకు ఎలాంటి అనుమతులతో పని లేదు, మా స్థలం మా ఇష్టం.. మున్సిపల్ అధికారులను చూసుకున్నాం అంటూ కాలనీవాసులను సైతం భయాందోళనకు గురి చేస్తున్నట్లు సమాచారం. మహదేవపురం ఫేజ్ – 3 లోని అక్రమ షెడ్డు నిర్మాణం, గాజులరామారం చిత్తారమ్మ ఆలయం ఎదురుగా వెలుస్తున్న చౌతారం సిర్వి నిర్మిస్తున్న సెల్లార్ నిర్మాణాలపై స్థానికులు మై క్యూర్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేసినా చర్యలు మాత్రం శూన్యంగానే మిగిలిపోతున్నాయి.

సదరు సెల్లార్ భవన నిర్మాణంపై ఫిర్యాదులు అందినా కూడా మళ్ళీ ఒక ఫ్లోర్ ఎక్కువగా వేశాడు అంటె ఇట్టే అర్థమౌతుంది స్థానిక టౌన్ ప్లానింగ్ అవినీతి కంపు ఎంతలా పేరుకుపోయి ఉందో అనేది. పలుమార్లు ఫిర్యాదులు అందినా కేవలం నోటీసులతో సరిపెడుతూ.. అందినకాడికి దండుకుంటూ కాలాయాపన చేస్తున్నారే తప్ప, శాఖాపరమైన చర్యలు తీసుకోవడం లేదంటూ మండిపడుతున్నారు స్థానిక ప్రజలు. ఇకనైనా స్థానికంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని, అవినీతి కూపంలో కూరుకుపోయి ఉన్న అనకొండల భరతం పట్టాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ను స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


రావి నారాయణ రెడ్డి నగర్లో..


Grievance Details
ID 2606265950536
Type Unauthorized Construction
Landmark 278-Gajularamaram, Gajularamaram, Qutbullapur
Mobile No 9618907705
Time 26-JUN-2026 15:06:51
Status Open Escalate
Posted by Dr Narsimlu Yellampally
Remarks There is a commercial shed construction without any permissions against to TG BASS in Gajularamaram division, beside Ramky Marvel, opposite to Shivakasi Fireworks in Gajularamaram Circle. Kindly take necessary action. Thank you.
Assigned to R.SUMITHRA,ACP() •••••• 0950
Images uploaded by you


Grievance Details
Status Open Escalate
Posted by Dr Narsimlu Yellampally
79, Mahadevpur Colony, Hyderabad, Telangana, 500117, India
Latitude: 17.5210207
Longitude: 78.4151984
Timestamp: 30-07-2026 04:20:48 PM
VIEW COMMENTS
POST COMMENT

అక్రమ నిర్మాణాలపై ఆన్లైన్ ఫిర్యాదులు (1&2)


చిత్తారమ్మ ఆలయం ముందు సెల్లార్ &కమర్షియల్ భవన నిర్మాణం

## బీహార్ ఆలయంలో తొక్కిసలాట.. ఏడుగురు భక్తుల మృతి

బీహార్, నవతరం: లఖిసరాయ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రావణ మాసం మూడో సోమవారం కావడంతో అశోక్ ధామ్ ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో ఆలయం వెలుపల జరిగిన తొక్కిసలాటలో కనీసం ఏడుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు.



ఈరోజ ఉదయం జరిగిన ఈ ఘటనతో ఆలయ ప్రాంగణంలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం పరిస్థితిని సమీక్షిస్తున్నామని అధికారులు తెలిపారు.

ఈ ఘటనపై లఖిసరాయ్ జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తారని తెలిపారు. ఉదయం 6:30 - 6:45 గంటల సమయంలో రెండు రైళ్లు రావడంతో రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయిందని చెప్పారు. భారీ జనసందోహం కారణంగా ఒకవైపు బ్యారికేడ్లు విరిగిపోయాయని, దీంతో జనం ఒకరిపై ఒకరు పడిపోయి ప్రమాదం జరిగిందని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.


శ్రీ శ్రీ శ్రీ ఎల్లమ్మ మరియు పోచమ్మ తల్లి దేవతల నూతన దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి రావాలని రోడమేస్త్రి నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు గుమస్తా మధుసూదన్ ను ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు

(నవతరం, కుత్బుల్లాపూర్)

## తనకు స్ఫూర్తి కలిగించింది ఇదే

**మొదటి పేజీ తరువాయి...** ఎంతగానో కదిలించింది. అమెరికా నుంచి తిరిగొచ్చి సొంత గ్రామ ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనకు ఆ పాత్రే స్ఫూర్తి. సినిమాలో మోహన్, హరిదాస్ అనే వ్యక్తిని కలిసినప్పుడు, అతను కుటుంబాన్ని పోషించడానికి పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోతాడు. తిరుగు ప్రయాణంలో రైల్వే స్టేషన్లో ఓ చిన్న పిల్లవాడు బడికి వెళ్లకుండా నీళ్లు అమ్ముకోవడం చూసి మోహన్ కంటతడి పెడతాడు. ఆ దృశ్యం చూసిన ప్రతిసారీ నా కళ్లలోనూ నీళ్లు తిరిగాయి" అని దీప్క ఉద్వేగంగా రాసుకొచ్చారు.

ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీప్క చేపట్టిన నిరసన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆయన ఉద్యమ తీవ్రతకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇప్పుడు 'జంతర్ మంతర్ సీజన్ 2'లో భాగంగా దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడమే లక్ష్యంగా ఈ 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమాన్ని చేపట్టారు. అమెరికా నుంచి తిరిగొచ్చి, సినిమాలోని మోహన్ పాత్రలాగే తన సొంత గ్రామానికి సేవ చేసే అవకాశం రావడం జీవితంలో ఒక వలయం పూర్తి కావడమేనని దీప్క పేర్కొన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడిగా ఉంటానని, అర్థవంతమైన మార్పు కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## రైల్వే స్టేషన్లలో కలుషిత నీరు..

**రెండవ పేజీ తరువాయి..** ఇదే నివేదికలో మరో కీలకమైన విషయాన్ని కాగ్ బయటపెట్టింది. సర్వే చేసిన 512 స్టేషన్లలో 458 స్టేషన్లు ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యాయని పేర్కొంది. 2018 ఆగస్టు 31 నాటికే అన్ని స్టేషన్లలో ఈ సౌకర్యాలు కల్పించాలని రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అవి అమలు కాలేదని కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది. కాగ్ లేవనెత్తిన అన్ని అంశాలను పరిష్కరించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే ప్రయత్నాల్లో భాగంగానే తాజా చర్యలు చేపట్టినట్లు రైల్వే శాఖ వెల్లడించింది.

## జాతీయ గీతాన్ని మార్చాలి

**రెండవ పేజీ తరువాయి..** 'జన గణ మన' రాశారు. దానిని మనం జాతీయ గీతంగా స్వీకరించాం. అందులో ప్రస్తావించిన భాగ్యవిధాత, పంజాబ్, సింధ్ వంటివి మనవి కావు. కానీ 'వందేమాతరం' పూర్తిగా మనది. లతా మంగేష్కర్ గారు ఆ గీతాన్ని ఎంతో అద్భుతంగా ఆలపించారు" అని పేర్కొన్నారు. తాను కూడా 'వందేమాతరం'పై ఏడు నిమిషాల నిడివి గల ఒక ఐకానిక్ గీతాన్ని రికార్డ్ చేశానని, అది ఆరు నెలల్లో విడుదల అవుతుందని తెలిపారు. అంతేకాకుండా, "వీలైనంత త్వరగా 'జన గణ మన'ను తొలగించి, 'వందేమాతరం'ను తీసుకురావాలి. ప్రధాని మోదీ గారు ఈ దిశగా ఇప్పటికే పని ప్రారంభించారు. ఇప్పుడు ప్రతి పాఠశాలలో, ప్రతి కార్యక్రమంలో 'వందేమాతరం'ను తప్పనిసరి చేస్తున్నారు. ఇది చాలా సంతోషకరమైన విషయం" అని ముఖేష్ ఖన్నా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ముఖేష్ ఖన్నా ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో, స్టాండప్ కమెడియన్ సమయ్ రైనా తన 'శక్తిమాన్' పాత్రపై వ్యంగ్యంగా మాట్లాడినప్పుడు, ముఖేష్ ఖన్నా సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించారు. సమయ్ రైనాను "కుక్క తోక" అంటూ ఘాటుగా విమర్శించారు. అయితే, ఆశ్చర్యకరంగా ఆ తర్వాత కొద్ది రోజులకే వారిద్దరూ కలిసి ఒక వాణిజ్య ప్రకటనలో నటించడం గమనార్హం. తన అభిప్రాయాలను ముక్కుసూటిగా, ఎలాంటి సంకోచం లేకుండా వెల్లడించడంలో ముఖేష్ ఖన్నా ఎప్పుడూ ముందుంటారని సినీ వర్గాలు అంటుంటాయి.

## ఆ పాప పెద్ద హీరోయిన్ అవుతుంది

**రెండవ పేజీ తరువాయి..** నటన కూడా తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నాడు. ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ అందించిన గీతాలు, నేపథ్య సంగీతం ప్రధాన బలమని రవితేజ స్పష్టం చేశాడు. రీ-రికార్డింగ్ ప్రేక్షకులను నేరుగా కథలోకి తీసుకెళ్లి, ఒక అద్భుతమైన భావోద్వేగ ప్రయాణాన్ని అందిస్తుందని వివరించాడు. ప్రొడక్షన్ డిజైనర్ సాయి సురేశ్, ఎడిటర్ ప్రవీణ్ పూడి, సినిమాటోగ్రాఫర్ విష్ణు శర్మ ఈ చిత్రాన్ని తమ సొంత ప్రాజెక్ట్లా భావించి ఎంతో నిబద్ధతతో పనిచేశారని వారిని అభినందించాడు. నిర్మాతలు నవీన్, రవితో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని రవితేజ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు. దర్శకుడు శివ నిర్వాణ ప్రతిభ గురించి సినిమా ఘనవిజయం సాధించాక సక్సెస్ మీట్లో సవివరంగా మాట్లాడతానని చెప్పడం ఆయన ఆత్మవిశ్వాసానికి అద్దం పడుతోంది. ఈ చిత్రంలో తాను సరికొత్త లుక్లో, విభిన్నమైన పాత్రలో కనిపిస్తానని.. 'ఇరుముడి' ప్రేక్షకులకు ఒక గొప్ప ఎమోషనల్, థ్రిల్లింగ్ అనుభూతిని అందిస్తుందని రవితేజ ఆశాభావం వ్యక్తం చేశాడు.

## హోమ్స్టేలుగా మారిన స్టార్ల గృహాలు

**మూడవ పేజీ తరువాయి..** ఇది సాధారణ హోటల్ గదిలో బస చేసినట్టు కాదు. సెలబ్రిటీల అభిరుచులకు అద్దం పట్టేలా ఉండే ఈ ఇళ్లలోకి అడుగుపెట్టగానే ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లిన ఫీలింగ్ కలుగుతుంది. గోడలపై అరుదైన పెయింటింగ్స్, పురాతన ఫర్నిచర్, వారి లైబ్రరీలోని పుస్తకాలు.. ఇలా ప్రతి వస్తువూ ఆయా ప్రముఖుల జీవనశైలిని దగ్గర నుంచి పరిచయం చేస్తుంది. గోవాలోని యువరాజ్ సింగ్ 'కాసా సింగ్' విల్లా, నటుడు అర్జున్ మాథుర్ 'ట్రాంక్విల్ హెవెన్' వంటివి ఈ ట్రెండ్కు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. సెలబ్రిటీలు తమ వెకేషన్ హోమ్లను ఆదాయ వనరులుగా మార్చుకోవడం ఈ ట్రెండ్ వెనుక ఉన్న ప్రధాన కారణం. హాలిడే డెస్టినేషన్లలో కోట్లు పెట్టి కొన్న విల్లాల్లో వారు ఏడాదికి కొన్ని వారాలు మాత్రమే ఉంటారు. మిగిలిన సమయంలో వాటి నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతాయి. ఈ భారాన్ని తగ్గించుకుని, అదనపు ఆదాయం సంపాదించేందుకు వాటిని నమ్మకమైన అతిథులకు అద్దెకు ఇస్తున్నారు. దీంతో 'వెకేషన్ హోమ్' కాస్తా 'ఇన్కమ్ హోమ్'గా మారుతోంది. సెలబ్రిటీల ఇళ్లలో బస చేయాలంటే అద్దె కూడా అదే స్థాయిలో ఉంటుంది. సాధారణ విల్లాల అద్దె రూ. 6,000 నుంచి మొదలైతే, ఈ లగ్జరీ సెలబ్రిటీ విల్లాల్లో ఒక రాత్రి గడపాలంటే రూ. 50,000 నుంచి రూ. లక్షకు పైగా చెల్లించాల్సిందే. ఉదాహరణకు, గోవాలోని అజయ్ దేవ్గణ్ 'విల్లా ఎటర్నా'లో ఒక రోజు అద్దె సుమారు రూ. 75,000. అద్దెలు భారీగా ఉన్నప్పటికీ, వీటికి డిమాండ్ తగ్గడం లేదు. దాదాపు ఏడాదంతా ఈ విల్లాలు ఫుల్ బుకింగ్స్తో రద్దీగా ఉంటున్నాయి. గోవా ఈ ట్రెండ్కు కేంద్రంగా ఉండగా, హైదరాబాద్కు చెందిన పారిశ్రామికవేత్తలు, వైద్యులు కూడా తమ విల్లాలను ఇలా హోమ్స్టేలుగా మారుస్తున్నారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com,
Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com